క్లుప్తంగా

రహదారి నిబంధనలు పాటించాలి



కర్లపాలెం: వాహనాలను నడిపే వారందరూ రహదారి నిబంధనలు పాటించాలని కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర చెప్పారు. శుక్రవారం కర్లపాలెం సెంటర్‌లో ఎస్ఐ రవీంద్ర వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర మోటారు వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

2న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

రేపల్లెరూరల్: డాక్టర్ వేజెళ్ల ప్రకాశరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఎంసీఏ) ఆధ్వర్యంలో గుంటూరు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి వారిచే పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో సెప్టెంబర్ 2న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంసీఏ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఆరోగ్యశ్రీ, ఓటరు కార్డుల జిరాక్స్‌లతోపాటు ఫోన్ నంబరును తీసుకురావాలన్నారు. పూర్తి వివరాల కోసం స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్

వలివేరు(వేమూరు): పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘం ద్వారా బోనస్‌లు ఇస్తున్నట్టు సొసైటీ అధ్యక్షులు ఈమని శ్రీనివాసరెడ్డి తెలిపారు. చుండూరు మండలం వలివేరులో సహకారం సంఘం ద్వారా 181 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.6.91 లక్షలు బోనస్ అందజేసినట్లు ఆయన తెలిపారు. సంగం డైయిరీ నుంచి రూ.1.49 లక్షలు మంజూరు కాగా రూ.5.40 లక్షలు కలిపి పాల ఉత్పత్తిదారులకు పంచామని వివరించారు. కార్యక్రమంలో డెయిరీ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ సందీప్ కృష్ణ, పాలక వర్గం సభ్యులు భూంపల్లి వెంకటేశ్వర రెడ్డి, పాల ఉత్పత్తిదారుల సంఘ కార్యదర్శి శివారెడ్డి, సూపర్‌వైజర్ బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.

2 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు



వేమూరు: భారతీయ జనతా పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం సెప్టెంబరు 2 నుంచి ప్రారంభించనున్నట్టు భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మంద జనార్దన్ చెప్పారు. వేమూరు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వెలువల సాంబశివరావు, ఎస్సీ మోర్చా బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లమాటి దాసు, నాయకులు పెనుమూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు నూరుశాతం పంపిణీ చేయాలి

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 31న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను నూరు శాతం పంపిణీ చేయాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 14 గ్రామ పంచాయతీలలో 5,900మందికిపైగా లబ్ధిదారులు ఉన్నారని, రూ.2 కోట్లకుపైగా నగదు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. శనివారం ఉదయం 5 గంటలకే పింఛన్ పంపిణీ ప్రారంభించాలని చెప్పారు.

కుక్కల దాడితో గొర్రె పిల్లలు మృతి

కర్లపాలెం: తుమ్మలపల్లిలో వీధి కుక్కల దాడితో గొర్రె పిల్లలు మృత్యువాత పడుతున్నాయి. ఫలితంగా గొర్రెల కాపరులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 10 రోజుల నుంచి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ఇప్పటి వరకు 25 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను పట్టుకుని దూరప్రాంతాల్లో విడిచిపెట్టాలని కోరుతున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శిని అడగ్గా గతంలో వీధి కుక్కలను పట్టుకుని ఊరి బయట విడిచామని, మళ్లీ పట్టుకుని తరలిస్తామని చెప్పారు.

పర్యావరణాన్ని కాపాడదాం

కొల్లిపర: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని 20 గ్రామాలలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

రక్షణ చర్యలు తప్పనిసరి



వైద్యుల రక్షణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. దేశంలో ఉన్న ప్రతి వైద్య కళాశాలలోనూ రక్షణ చర్యలు తప్పని సరిగా చేపట్టాలి. ముఖ్యంగా వైద్యులు, సిబ్బంది పని చేసే చోట ప్రత్యేక భద్రత కలించాలి. రోగులకు సేవలు అందించే వైద్యులపై దాడులు చేయడం సరికాదు. ప్రజల ఆలోచన దృక్పథంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది.

– పి.అరుణరాణి,
పారామెడికల్ ఆప్తమాలజిట్, భట్టిప్రోలు



ఇలాంటి ఘటనలు దారుణం



ఎన్నో ఆశలతో వైద్య వృత్తిలోకి వస్తున్న మహిళలపై ఇలాంటి ఘటనలు దారుణం. కోల్‌కతాలో జరిగిన ఘటన బాధాకరం. శిక్షణ పూర్తి చేసుకుని వైద్యురాలిగా తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలనుకున్న విద్యార్థిని ఆశలను చిదిమేశారు. మహిళా వైద్యుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

–డాక్టర్ కె.కావ్య,
సివిల్ అసిస్టెంట్ సర్జన్ సీహెచ్‌సీ, కొల్లిపర

శ్రావణ శోభతో మెరి'సిరి'



రేపల్లెలో నెమలి ఫించముల అలంకరణలో మెరిసిన బూరుగులమ్మ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామదేవత గోగులమ్మ



పెదపులివర్రులో విశేష అలంకారంలో బాలాత్రిపుర సుందరీదేవి కటాక్షం

శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని ప్రముఖ ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో మెరిశారు. భక్తులు అమ్మవార్ల దివ్య మంగళ స్వరూపాలను కనులారా తిలకించి పులకించారు. రేపల్లె గ్రామదేవత బూరుగులమ్మను నెమలి ఫించములు, స్వర్ణ, రజతాభరణాలు, కలువ పూలతో అలంకరించారు. సుప్రభాత సేవలు చేసి పంచామృతాలు, పండ్ల రసాలు, పసుపు, కుంకుమలతో అభిషేకించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సారె, చద్ది నైవేద్యాలు సమర్పించారు. భట్టిప్రోలు మండలంలోనూ పలు ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో భక్తులను కటాక్షించారు. భట్టిప్రోలులో కామాక్షిమాత ప్రత్యేక పారాయణం జరిగింది.

– రేపల్లె రూరల్/ భట్టిప్రోలు



భట్టిప్రోలులో పారాయణంలో పాల్గొన్న భక్తులు



పెదపులివర్రులోని పేరిందేవి అమ్మవారి మంగళ స్వరూపం

ఆనందవానందమాయె

అల్పపీడన ప్రభావంతో గురువారం రాత్రి నుంచి బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో జోరుగా వాన కురుస్తోంది. దాదాపు నెలన్నరగా వర్షంలేక అల్లాడిన ప్రజలు, రైతులకు ప్రస్తుత వర్షం ఆనందం కలిగిస్తోంది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లులు పడుతూనే ఉండడంతో జనజీవనానికి కొంత ఆటంకం కలిగింది. రేపల్లెలో అత్యధికంగా 40.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవ్వగా, అత్యల్పంగా చెరుకుపల్లిలో 9.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. నిజాంపట్నంలో 19.4 మిల్లీమీటర్లు, నగరంలో 13.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

- కొల్లూరు మండలంలో శుక్రవారం 16.20 మిలీమీటర్ల వర్షం కురిసింది. ఫలితంగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో మూడురోజులపాటు వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించడంతో తమకు సాగునీటి కష్టాలు తీరతాయని చెబుతున్నారు.

– రేపల్లె రూరల్/కొల్లూరు



రేపల్లె పట్టణంలో జోరుగా కురుస్తున్న వర్షం



కొల్లూరు వద్ద వరి చేలో వర్షపు నీరు

గుళ్లపల్లిలో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ



గుళ్లపల్లిలో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖను ప్రారంభించి మాట్లాడుతున్న డీజీఎం సుధాకర్

చెరుకుపల్లి: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలనే గుళ్లపల్లి గ్రామంలో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖను ప్రారంభించామని ఆ బ్యాంక్ హైదరాబాద్ జోన్ డీజీఎం ఎంవీఎస్ సుధాకర్ చెప్పారు. గుళ్లపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగ సంస్థల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా రెండో స్థానంలో ఉందన్నారు, తాను చెరుకుపల్లి మండలంలోనే పుట్టి ఇక్కడే విద్యాభ్యాసం కొనసాగించానని, ఈ ప్రాంతంలో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖను ఏర్పాటుకు కృషి చేశానని వెల్లడించారు. పేద విద్యార్థులకు విద్య రుణాలు, రైతులకు వ్యవసాయ రుణాలు, డ్వాక్రా సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా గుంటూరు ఏజీఎం ఎస్.కె. కిరణ్‌రెడ్డి, డెప్యూటీ రీజినల్ మేనేజర్ పి.చంద్రమౌళి, బ్రాంచ్ మేనేజర్ డి.వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పీఎం సురక్ష యోజనను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శేషమాంబ

పిట్టలవానిపాలెం: పీఎం సురక్ష యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఐటీసీ ప్రతినిధి నారాయణ రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని పారిశుద్ధ్య కార్మికులకు ఐటీసీ, సెర్ప్ సంస్థల ఆధ్వర్యంలో పీఎం, జేజేవై, పీఎంఎస్‌బీవై, ఏబీ వంటి జీవిత బీమా పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి ముద్ర యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాల ప్రయోజనాలను వివరించారు. ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ మాట్లాడుతూ క్లాప్ మిత్రలంతా మండలంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ మధుసూదన రెడ్డి, సెర్ప్ సంస్థ సీఓ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు శ్రీకృష్ణ, గోపిక వేషధారణల పోటీలు



శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో ఆలయానికి వచ్చిన చిన్నారులతో గ్రామపెద్దలు

పిట్టలవానిపాలెం: అల్లూరు గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్నారులకు శ్రీకృష్ణ, గోపికల వేషధారణ పోటీలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంవీఎస్ వర్మ మాట్లాడుతూ ఈఏడాది తొలిసారిగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పోటీలలో 36 మంది చిన్నారులు పాల్గొన్నారని వెల్లడించారు. ప్రథమ స్థానం పొందిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.3 వేలు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రూ.500 చొప్పున కన్సొలేషన్ బహుమతిగా అందించినట్లు వెల్లడించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారులకు వేషధారణ పోటీలు నిర్వహించేందుకు సహకరించిన మంతెన కృష్ణంరాజు కుటుంబీకులను దేవస్థానం తరఫున అభినందించారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి చిత్రంలో జెడ్పీటీసీ ఉదయభాస్కరి, అధికారులు

భట్టిప్రోలు: ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేసి మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతోపాటు ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వ హయాంలో ఫాగింగ్ మిషన్లు అందజేసినా కొన్ని లేకపోవడం, మరికొన్ని పాడవడంతో పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల సీజన్ కావడంతో మురుగు నీటి నిల్వలపై ఎబెట్ ద్రావణం చల్లించాలని సూచించారు. గ్రామ పంచాయతీ వారీగా పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు, అధికారుల పని తీరును సమీక్షించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీఓ జి. చంద్రశేఖరరావు, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి పాల్గొన్నారు.

తూములూరులో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



తూములూరు(కొల్లిపర): మండల పరిధిలోని తూములూరు గ్రామంలోని అయోధ్యనగర్, ఎస్టీ కాలనీలో శుక్రవారం ఉదయం 11.02 గంటలకు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జ్యోతిష్య–వాస్తు పండితులు నారాయణం రాజా గోపాలాచార్యులు చేతుల మీదుగా వేద మంత్రాలు నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గత మూడు రోజుగా అనేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వార్లను ప్రతిష్ఠించారు. ఆలయంలో ప్రతిష్ఠ అనంతరం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి గ్రామంలో మహిళలు, చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో స్వామి వార్లలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులకు అన్నప్రసాదం వితరణ నిర్వహించారు.

చందోలులో ఇంటి పన్నులు స్వాహా!

పిట్టలవానిపాలెం: ఇంటి పన్నులు వసూలు చేసి గ్రామ పంచాయతీకి జమ చేయకుండా బిల్ కలెక్టర్ సొంతానికి వాడుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ఇంటి పన్నులు సుమారు రూ.3 లక్షలు వసూలు చేసి స్వాహా చేశారని గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి శేషగిరిరావును వివరణ కోరగా కాంట్రాక్టు బిల్ కలెక్టర్ ఎంతో కాలంగా పనిచేస్తున్నారని, వసూలు చేసిన ఇంటి పన్నుల్లో కొంతమొత్తం ఆయన వాడుకున్నారని, దీనిపై నోటీసు ఇచ్చామని వెల్లడించారు. ఆయన సోమవారం వాడుకున్న సొమ్ము చెల్లిస్తానని చెప్పారని వివరించారు. ఈవిషయంపై ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబను వివరణ కోరగా చందోలు గ్రామ పంచాయతీకి వెళ్లి విచారణ చేస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే పిట్టలవానిపాలెం మండలంలోని మంతెనవారిపాలెం గ్రామ పంచాయతీలోనూ ఇదే తరహాలో గ్రామ పంచాయతీ నిధులు సుమారు రూ.8 లక్షలకుపైగా సాక్షాత్తూ గ్రామ కార్యదర్శి స్వాహా చేశారని ఆధారాలతో సహా గ్రామ సర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపోగేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

రేపల్లె రూరల్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు బ్రహ్మరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎన్ఎంయూ పోరాటాలు చేస్తోందన్నారు. పీటీడీ సర్వీసులో ఉన్న ఉద్యోగుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సర్వీసులో మృతి చెందిన ఉద్యోగుల అంత్యక్రియల ఖర్చులకు రూ.25 వేలు ట్రెజరీ ద్వారా అందించాలన్నారు. కండక్టర్లు, డ్రైవర్లకు నైట్‌అవుట్ అలెవెన్స్‌లను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ కార్యదర్శి డి.చిట్టిబాబు, నాయకులు ముత్తయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఫుట్‌బాల్ స్టేట్ కార్యదర్శి క్రాంతికుమార్

బాపట్ల: క్రీడలతో విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని ఫుట్‌బాల్ స్టేట్ కార్యదర్శి కె.క్రాంతికుమార్ పేర్కొన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులకు శుక్రవారం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించాలని సూచించారు. విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, గ్రామ సర్పంచ్ బోనా వెంకటేశ్వరమ్మ, ఏఎంసీ చైర్మన్ నాగరాజు, గ్రామ పెద్దలు కిషోర్, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, బసంత్ కుమార్, హరిబాబు, ఉపాధ్యాయులు వీర చంద్ర పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

తెనాలిరూరల్: అధిక కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన సాయి, వసుంధరలకు పదేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవలి కాలంలో పుట్టింటి నుంచి డబ్బులు తెమ్మంటూ భర్త శారీరక, మానసిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ మేరకు భార్య ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.